క్లుప్తంగా

నీటి కుండీల పంపిణీ



నీటి కుండీలు పంపిణీ చేస్తున్న జైన్ సేవాసమితి సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు జైన్ సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు వెయ్యి నీటి కుండీలను పంపిణీ చేశారు. స్థానిక శ్రీవెంకటేశ్వర జనరల్ మార్కెట్‌లోని బి 1,2 షాపుల వద్ద జరిగిన ఈ కార్యక్రమాన్ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లడుతూ మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు జైన్ సేవా సమితి నీటి కుండీలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జైన్ సేవా సమితి అధ్యక్షుడు విక్రమ్ జైన్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా నీటి కుండీలను పంపిణీ చేస్తున్నామని, వీటిలో మూగజీవులను నీరు పెట్టాలని కోరారు. కార్యక్రమంలో అశ్విన్ జైన్, మౌంటు జైన్, పింటూ జైన్, అమృత్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై విద్యుత్ భారం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: కూటమి పాలనలో సామాన్యులపై విద్యుత్ చార్జీల పేరుతో పెను భారం మోపుతున్నారని సీపీఎం నగర కార్యదర్శి పవన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ట్రూఅప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని, సెకీ ఒప్పందం, టైమ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవ నాయకుల కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దళిత క్రైస్తవ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ నాయకుడు జంగం సుబ్బారావు డిమాండ్ చేశారు. ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా శుక్రవారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కోరుకొండ చిరంజీవి మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ వంటి గొప్ప మేధావి, మంచి దైవసేవకుడి మృతి బాధాకరమన్నారు. పాస్టర్ పి.ఎర్నెస్ట్ మోజెస్, జువ్వల రాంబాబు, తాళ్లూరి బాబూ రాజేంద్ర ప్రసాద్, దారా ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం



కంబాలచెరువు: పుష్కర ఘాట్ ఇసుక ర్యాంపు వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 53 ఏళ్ల వయస్సు) మృతదేహం లభ్యమైంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని నదిలోంచి వెలికి తీశారు. ఆధారాల కోసం గాలించగా ఎటువంటి ఆచూకీ లభించలేదు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.


సినిమాలు



శ్యామల :	రాబిన్‌హుడ్
సూర్యమినీ :	ఎల్2ఎంపురాన్
సూర్యప్యాలెస్ :	దిల్‌రుబా, ఎవడే సుబ్రహ్మణ్యం
స్వామి :	కోర్ట్
శివజ్యోతి :	రాబిన్‌హుడ్
అనుశ్రీ :	వీరధీరశూర
ఊర్వశి :	ఎల్2ఎంపురాన్
మేనక :	ఆర్టిస్ట్, కిసకిసకిసిక్
రంభ :	షణ్ముఖ
కుమారి :	మ్యాడ్ స్క్వేర్
అప్సర :	మ్యాడ్‌స్క్వేర్
అశోక :	మ్యాడ్‌స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్ :	రాబిన్‌హుడ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	మ్యాడ్‌స్క్వేర్
కడియం	
వెంకటసూర్య :	రాబిన్‌హుడ్

ముక్కు మూసుకోవాల్సిందే..

- రోడ్లపై పేరుకుపోతున్న చెత్త
- దుర్వాసనతో అవస్థలు
- ప్రజల్లో అవగాహనా లేమి



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



రక్షణ గోడ కూలిపోవడంతో ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

ప్రకాశం నగర్: నగరంలో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు ప్రగతికి చిహ్నాలుగా భావిస్తారు. రోడ్ల సౌకర్యం బాగా ఉన్న ప్రాంతాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయి. అయితే నగరంలో అత్యంత రద్దీగా ఉండే దానవాయిపేట కందుకూరి రాజ్యలక్ష్మి స్త్రీల కళాశాల అనుకుని ఉన్న రాజేంద్ర నగర్ విజయదుర్గా కళాశాల రోడ్డు, సుబ్బారావు పేట వినాయకుడి గుడి ప్రాంతాల్లో రోడ్లపై చెత్తా చెదారాలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. అపరిశుభ్ర వాతావరణంతో స్థానికులు, వాహన చోదకులు ముక్కుమూసుకుని ప్రయాణించే పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా అపార్ట్‌మెంట్‌లో నివాసించే వారు, స్థానికులు ఎక్కడిక్కడ రోడ్డు పక్కన చెత్తను వేస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

అవగాహన లేకపోవడమే కారణం

రోడ్డుపై చెత్త వేయకూడదన్న అవగాహన లేకపోవడంతో కొందరు ఇలాంటి పనులకు పాల్పడుతున్నారని, ప్రజల్లో చైతన్యం వస్తేనే ఇటువంటి వాటికి చెక్ పెట్టగలమని నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. చెత్తను తడి, పొడిగా వేరు చేసి నగరపాలకసంస్థ సిబ్బందికి అందజేయాలని కోరుతున్నారు. చెత్తను కాలువల్లో, రోడ్లపైన పారబోస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

సుబ్బారావుపేట వినాయకుడి గుడి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. దీని రక్షణ గోడ కూలిపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది.

విద్యుత్ కోతలతో అవస్థలు

ఏపీఈపీడీసీఎల్ డీ5 సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం సమయంలో విద్యుత్ కోతలతో జనం ఇబ్బంది పడుతున్నారు. లైన్ల మరమ్మతులు, ఓవర్ లోడ్ వంటి కారణాలతో కోతలు ఉన్నప్పటికీ, ముందురోజు సమాచారం ఇచ్చి ఆయా సెక్షన్ల పరిధిలో సరఫరా ఆపేవారు. ప్రస్తుతం అటువంటి సమాచారం ఇవ్వడం లేదని స్థానికులు వాపోతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌రు నక్కపల్లి శామ్యూల్ శుక్రవారం ప్రకటించారు. చైతన్య కాలేజ్ స్ట్రీట్, వీఎల్ పురం పెద్ద స్ట్రీట్, చక్రధర్ హాస్పిటల్ ఏరియా, తిలక్ స్ట్రీట్, మోరంపూడి, వీఎల్ పురం పార్క్ స్ట్రీట్స్, ఆదర్శ హాస్పిటల్ రోడ్, వాసిరెడ్డి రాంబాబు రోడ్, తిలక్ రోడ్, సత్యనారాయణపురం, రైతుబజార్ రోడ్, కోనేరుపేట, ఆల్ బ్యాంక్ కాలనీ, శ్రీనగర్,అమ్మ హాస్పిటల్ స్ట్రీట్, మోడల్ కాలనీ, శ్రీలక్ష్మీ నగర్, గణేష్ నగర్, సాయి నగర్, బాపూజీ నగర్, గాదాలమ్మ నగర్, వెంకటగిరి, హుకుంపేట, హుకుంపేటలోని ఎస్సీ పేట పరిసర ప్రాంతాలలో ఆ సమయంలో విద్యుత్ ఉండదన్నారు.

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సంజీవయ్య నగర్, బర్మా కాలనీ, సుబ్బారావు నగర్, జాన్ వెస్లీ చర్చి ప్రాంతాలలో విద్యుత్ ఉండదు.

ఘనంగా డాక్టర్ గూడూరి పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి, విజయభారతి చెస్ట్ ఇన్‌స్టిట్యూట్ అధినేత డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పుట్టినరోజును శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరం సిటీ యూత్ విభాగానికి వేసం వెంకటేశ్వరరావు (బిల్డర్ చిన్నా), మహిళా విభాగానికి పోలు విజయలక్ష్మి, రైతు విభాగానికి గోరిజాల సర్వేశ్వరరావు, బీసీ సెల్‌కు పీత మురళీ రామకృష్ణ, ఎస్సీ సెల్‌కు తిరగాటి దుర్గారావు, ఎస్టీ సెల్‌కు సాలా సావిత్రి, మైనార్టీ సెల్‌కు ఆరిపుల్లాఖాన్ (ఛోటా ఖాన్), స్టూడెంట్ వింగ్‌కు సింగంపల్లి కార్తిక్, అర్జున్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు పుట్టా చంద్రశేఖర్ నియమితులయ్యారు.

- మున్సిపల్ వింగ్‌కు మజ్జి అప్పారావు, ఆర్టీఐ వింగ్‌కు అమీర్ బాషా, వలంటీర్ వింగ్‌కు అరుష బట్టు అనంతలక్ష్మి, గ్రీవెన్స్ సెల్‌కు పులగం రామలింగారెడ్డి, వాణిజ్య విభాగానికి యజ్ఞవరపు మరిడియ్య, వీవర్స్ వింగ్‌కు నందన్ స్వామి, వైఎస్సార్ టీయూసీకి నరవ గోపాలకృష్ణ, అంగన్ వాడీ వింగ్‌కు బొమ్మదేవి సూర్యకుమారి, సోషల్ మీడియా వింగ్‌కు రేగుళ్ల బాల శ్రీధర్ (నాని), ఐటీ వింగ్‌కు చేబ్రోలు వెంకట్ లింగం, పబ్లిసిటీ వింగ్‌కు పెద్దిరెడ్డి శ్రీనివాస్, బూత్ కమిటీ వింగ్‌కు సీరపు నగేష్ చంద్ర రెడ్డి (గణేష్)ని నియమించారు.
- స్టేట్ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా వేమగిరి కృష్ణ, స్టేట్ వలంటీర్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా పెదపాటి రమేష్ బాబును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దాతృత్వం గొప్పతనాన్ని చాటి చెప్పేదే రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలు, అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: దాతృత్వం గొప్పతనాన్ని చాటి చెప్పేదే రంజాన్ మాసమని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి ఫంక్షన్ హాలులో శుక్రవారం జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దైవంపై నమ్మకం కలుగచేసే గొప్ప గ్రంథం ఖురాన్ అన్నారు. రంజాన్ మాసంలో రాష్ట్ర ప్రభుత్వం పి 4 కార్యక్రమానికి నాంది పలికిందన్నారు. సంఘటితంగా ఉంటే మనం అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు, పేదరికం లేని సమాజ స్థాపన సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామకృష్ణ, ఎస్పీ డి.నరసింహ కిషోర్, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

కంబాలచెరువు: ఇన్నీసుపేటలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్ విద్యార్థులకు ఐదో ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాసరెడ్డి శుక్రవారం పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. టూటౌన్ సీఐ పి.శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: గృహ నిర్మాణ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అదనంగా రూ.50 వేలు అందిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఈ మేరకు రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో లబ్ధిదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో డి.శ్రీనివాస్, నాయకులు మత్సేటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, మార్ని వాసుదేవ్ పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి ప్రభుత్వం పెద్దపీట

రాజమహేంద్రవరం సిటీ: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని స్వయం సహాయక సంఘాల కుటుంబ సభ్యుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా రాపిడో భాగస్వామ్యంతో 25 ఎలక్ట్రిక్ బైక్‌లను వివిధ బ్యాంకుల రుణాలతో అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ బైక్ రైడర్స్‌గా కూడా మహిళలు జీవనోపాధి కల్పించుకోవటం ఆనందదాయకమన్నారు. అలాగే పార్కులను కూడా మహిళా సంఘాలకు అప్పగించే ఆలోచన కూడా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సిటీ మిషన్ మేనేజర్ వి.రామలక్ష్మి పాల్గొన్నారు.

చురుగ్గా ఈ-శ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్



వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ-శ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్ చురుగ్గా సాగుతోంది. తొలిరోజు శుక్రవారం 500 మందికి నమోదు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు అసోసియేషన్ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ నమోదు శిబిరం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

7 నుంచి ఇంటర్ అడ్మిషన్లు



హేమ, ప్రిన్సిపాల్

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏప్రిల్ 7 నుంచి ఇటర్మీడియట్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లిషు మీడియంలో అందుబాటులో ఉన్నాయన్నారు. అదే విధంగా ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏప్రిల్ ఒకటి నుంచి కళాశాల పునఃప్రారంభం అవుతుందని ఆ రోజు నుంచే తరగతులు ప్రారంభిస్తామన్నారు.

టెలిమెడిసిన్ సిబ్బందికి నోటీసులు

- కలెక్టర్ ఆదేశం

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య సిబ్బంది ధోరణిపై సాక్షి దినపత్రిక శుక్రవారం ప్రచురించిన ఆ కుర్చీ మాదే...ఈ కాళ్లు మావే అనే కథనానికి కలెక్టర్ ప్రశాంతి స్పందించారు. ఆ వైద్య సిబ్బందిపై చర్యలకు ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులు కిటకిటలాడే పనివేళల్లో కొంతమంది వైద్య సిబ్బంది విధులు నిర్వర్తించకుండా, సెల్‌ఫోన్లు చూసుకుంటూ, కబుర్లు ఆడుకుంటున్నారు. ఆ విధంగా ఉన్న టెలిమెడిసిన్ వైద్యులపై సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీన్ని చూసిన జిల్లా కలెక్టర్ వెంటనే డిప్యూటీ కలెక్టర్, ఆసుపత్రి ఓఎస్‌డీ భాస్కరరెడ్డిని వెంటనే ఆసుపత్రికి వెళ్లి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంటనే ఆసుపత్రికి చేరుకుని టెలిమెడిసిన్ వైద్య సేవలు అందించే వైద్య సిబ్బందిని పిలిచి జరిగిన దానిపై ఆరా తీశారు. డ్యూటీలో ఎందుకు అలసత్వం వహిస్తున్నారంటూ ఆగ్రహించారు. వారితో జరిగిన దానిపై లిఖిత పూర్వకంగా లెటర్ రాయించారు. అలాగే దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ కలెక్టర్‌కు లెటర్ ఇచ్చారు.

వినియోగదారుడికి నష్టపరిహారం అందజేత



నష్టపరిహారం అందుకుంటున్న సురేష్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: సెల్‌ఫోన్ కంపెనీ సర్వీస్ సెంటర్ సక్రమంగా స్పందించకపోవడంతో బొమ్మూరుకు చెందిన పోగుల సురేష్ కుమార్ వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా స్క్రీన్‌పై నిలువుచారలు వచ్చాయి. దీనిని గురించి వీవో సెల్ కంపెనీ సర్వీస్ సెంటర్‌ను సంప్రదించగా వారు రూ.10 వేలు అవుతుందని చెప్పారు. దీంతో అడ్వకేట్ చిన్నం కల్పన రెడ్డి ద్వారా బాధితుడు కోర్టును ఆశ్రయించారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో ఉన్న వీవో సెల్ కంపెనీకి, రాజమహేంద్రవరంలోని సర్వీస్ కంపెనీకి నోటీసులు ఇచ్చారు. రిపేర్‌తో పాటు నష్టపరిహారం చెల్లించాలని వినియోగదారుల ఫోరం అధ్యక్షులు జేవీఎస్‌వీ ప్రసాద్ తీర్పు చెప్పారు. దీంతో శుక్రవారం పోగుల సురేష్‌కు వీవో కంపెనీ ఏఎస్ఎం మణి, అడ్వకేట్లు చిన్నం కల్పనరెడ్డి, కూనిరెడ్డి మల్లేశ్వరరావు సమక్షంలో నష్టపరిహారం అందజేశారు.

విమానాశ్రయం రోడ్డు విస్తరణకు చర్యలు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని క్వారీ మార్కెట్ నుంచి విమానాశ్రయం వరకూ రోడ్డులో ఆక్రమణలను తొలగించి, విస్తరణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విమానాశ్రయం రోడ్డును తనిఖీ చేశారు. కోలమూరు, కొంతమూరు గ్రామాలలో డ్రైనేజీలపై ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీలతో పారిశుధ్యంపై సమీక్షించారు. ఆవులను రోడ్డు మీదకు వదిలితే యజమానులకు జరిమానా విధించాలన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల పర్యటన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే పర్యవేక్షణలో శుక్రవారం పర్యటన చేశారు. కడియం నర్సరీ, ద్రాక్షారామ ఆలయం, కాకినాడ పోర్ట్, కోరంగి ఫారెస్ట్, యానా వంటి ప్రదేశాలను సందర్శించారు. దీని ద్వారా చారిత్రక, సాంస్కృతిక, భౌగోళిక, పర్యావరణ అంశాలపై అవగాహన పొందారు. పురావస్తు కళాఖండాలు, ద్రావిడ ఆలయ శిల్పశైలి, ఫ్రెంచ్ వలస ప్రభావం, జీవవైవిద్యం రక్షణ, కాకినాడ ఓడరేవు ప్రాముఖ్యతపై అధ్యయనం చేశారు. విభాగాధిపతి డాక్టర్ బి.అంజనీకుమారి, అధ్యాపకులు పి.తులసి కుమారి, కె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణాచార్యుల జయంతి



పుట్టపర్తి నారాయణాచార్యులు జయంతిలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: సాహిత్య, సంగీత రంగాలకు పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు విశేష సేవలు అందించారని రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఉషారాణి అన్నారు. నారాయణ చార్యులు జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సేవలు గుర్తు చేసుకున్నారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

కంబాలచెరువు: ది రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరిగాయి. 2025 – 26 కాలపరిమితికి సంబంధించి జరిగిన ఈ ఎన్నికల్లో సీనియర్, జూనియర్ లాయర్లు, మహిళా న్యాయవాదులు పాల్గొని ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శోభనాద్రి శాస్త్రి, ఉపాధ్యక్షుడిగా అల్లంపల్లి రామకృష్ణ, ట్రెజరర్‌గా కర్ర హనుమంతరావు, సెక్రటరీగా పెళ్లూరి రమేష్, జాయింట్ సెక్రటరీగా మలకా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కె.మల్లేశ్వరరావు వ్యవహరించారు.

ఎమ్మెస్సార్ ఫాలోవర్స్ సేవలు



సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరంసిటీ: రాష్ట్ర హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెస్సార్ ఫాలోవర్స్ ఆధ్వర్యంలో నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆజాద్ చౌక్ సెంటర్‌లో జాంపేట ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ముస్లిం మహిళలకు తోఫా పంపిణీ చేశారు. కంబాలచెరువు హైటెక్ బస్టాండ్ దగ్గర ఆటోస్టాండ్ యూనియన్ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ చేశారు. 32వ డివిజన్ రైతు బజార్ దగ్గర చలివేంద్రం ప్రారంభించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కడియం: స్థానిక ఏవీఆర్ హైస్కూల్లో 2018–19 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. వీరు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీట్లు పొందడమే కాకుండా, ఇప్పుడు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కూడా విజయం సాధించారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాటి సత్య ప్రసన్న, యర్రంశెట్టి సౌమ్య, పోసి మంజులను ఉపాధ్యాయులు సత్కరించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత విద్యార్థులు మంచి భవిష్యత్తు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అక్షయ, నాగమణి, పద్మశ్రీ, శరత్‌బాబు, శ్రీనివాస్, వీరబాబు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ జాతర



తాటిచెట్టును ఊరేగిస్తున్న భక్తులు

రాజానగరం: గ్రామదేవత నూకాలమ్మ జాతర శుక్రవారం వైభవంగా జరిగింది. గరగ నృత్యాలతో పాటు వివిధ దేవతా మూర్తులు, శక్తి వేషాలతో కళాకారుల ప్రదర్శనలు అందరినీ అలరించాయి. తొలుత మధ్యాహ్నం గ్రామంలో తాటిచెట్టును ఊరేగించారు. నూకాలమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు గ్రామంలో అన్ని వీధుల్లోనూ సాగింది. పలువురు మహిళలు బిందెలతో నీటిని ఆ తాటిచెట్టుపై పోస్తూ భక్తితో నమస్కరించారు. అనంతరం అదే తాటిచెట్టుతో ఊయల వేసి, అమ్మవారికి ఊయల సేవ చేశారు. శనివారం ఉదయం తీర్థం జరగనుంది.

నేటి నుంచి నూకాలమ్మ తీర్థం

రంగంపేట: వడిశలేరు గ్రామ దేవత నూకాలమ్మ వార్షిక మహోత్సవం శని, ఆదివారాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మ్రొక్కులు చెల్లించి, అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు.

సారాకు బానిసలు కావొద్దు

రాజానగరం: సారాకు ఎవ్వరూ బానిసలు కావొద్దని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రాజానగరంలో నవోదయం 2.0 పేరుతో ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ చేశారు. సారా వద్దు.. ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. సారా తయారు చేసినా, విక్రయించినా నేరమే అవుతుందని, అటువంటి వారిపై పీడీ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఝాన్సీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపవాస ప్రార్థనలతో ఆధ్యాత్మిక శక్తి

కోరుకొండ/ సీతానగరం: ఉపవాస ప్రార్థనలతో ఆధ్యాత్మిక శక్తి పెరుగుతుందని తొర్రేడుకు చెందిన ఫాదర్ మణిభూషణం అన్నారు. సీతానగరం మండలం కూనవరం ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం ఉపవాస కూటాలు నిర్వహించారు. ఫాదర్ మణిభూషణం మాట్లాడుతూ ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమలకు గుర్తుగా క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు చేయాలన్నారు. దీనిలో భాగంగా తొలుత శిలువను మోస్తూ ప్రదర్శన చేశారు.